# సముద్ర జ్వాల

ఇంకా రాలేదే! ఈ వారంరోజులు తనని చూడకుండా ఎల్లా ఉన్నానో! ఎల్లా గడచినయి ఈ వారం దినాలు? ఆశ్చర్యం. అసలు తను వెళ్తానన్న రోజున ఇల్లా గడపగలననే నమ్మకమే లేక పోయింది. కాని ఎల్లాగైతేనేం. నెట్టుకొచ్చాను. ఈవేళ తను వస్తానన్న రోజు. ఈరోజే మనోవ్యథ ఎక్కువగా వుంది. అది సహజమే ననుకుంటా. సహజమైతే. తల ఈ ఆలోచనలతో ఎందు కిల్లా బద్దలవుతూంది? అసలు తనకీ ఇలాగే మనస్సులో బాధగా వుండి వుంటుంది. ఆ విషయమే ఆలోచించ కుండా నాకున్న బెంగలే ఆలోచిస్తున్నా, అది స్వలాభం. అది తప్పు.

పోనీ, తనని మళ్ళా జీవితంలో ఒక్కసారి చూస్తే చాలు. అసలు ఇక సుఖంగా చచ్చిపోగలను, అనిపిస్తూంది. కాదు, అది అబద్ధం. తాను నావాడు. తనని వివాహ మాడి, నిరంతరమూ తనతో సహజీవితయాత్ర గడపాలి. ఇదేగా నా కల తనని ప్రేమించిన తరువాత. అతని ప్రేమేగదా నా జీవితానికి అర్థం ఇచ్చింది.

ఈ మధురస్మృతుల తరంగాలూ వస్తూనే వున్నాయి, వసుంధరాదేవికి.

ఎంత గాఢంగా ప్రేమించాడు మహేశ్వర్ వసుంధరాదేవిని. అసలు మహేశ్వర్‌కి ఆడవాళ్ళ పొడే గిట్టేది కాదుట. తను మరీ ఇదిగా పెరిగాడుగదా! వాళ్ళమ్మగారు మహా నిజాయితీగా, పూర్వాచారపు కట్టుదిట్టాలతో పెంచిందట. అందువల్ల మరీ చిందులేస్తూ మగవాళ్ళందరి ముందు ఒకమాదిరి స్వేచ్ఛగా ప్రవర్తించేవాళ్ళంటే, మహేశ్వర్‌కి ఏవగింపు. మరి అల్లాంటప్పుడు తనని చూస్తూ, మహేశ్వర్ ఎల్లా అంత మంచులా కరిగిపోయాడో! ధుమధుమలాడే మహేశ్వర్ ముఖం, తన పరిచయమైన ఈ ఒక్క సంవత్సరంలో ప్రసన్నవదనంగా ఎల్లా మారిపోయిందో!

విచిత్రం ! మహేశ్వర్ ఊరు వెళ్లిన ఈ వారంరోజులనించీ, వసుంధర ప్రపంచం చీకటిగానే వుంది. అతని ఉత్తరాలు వచ్చినప్పుడుమాత్రం, ప్రొద్దు కనిపించేది. ఈవేళ నిండు సూర్యోదయం కాబోతూంది. మహేశ్వర్ వస్తాడు. తరువాత వివాహం విషయం నాన్నతో ప్రస్తావిస్తా నన్నాడు. నిన్నటి ఉత్తరంలోకూడా అదే వ్రాశాడు. తన మేడ repairs, వెల్లా, అదీ అయిపో వచ్చినయ్యిట. నాన్నగారి అనుమతి తీసుకున్న తరువాత వెంటనే పెళ్లి. ఆ తరువాత, "నా లక్ష్మిని నా ఇంటికి తెచ్చుకుంటాను" అని రాశాడు. అవును స్పష్టంగా అదేమాట. వసుంధర కళ్ళల్లో ఆ అక్షరాలు మెదుల్తూన్నాయి. తిరిగి ఆ ఉత్తరం చూడక్కర్లేకుండానే ఏ అక్షరం ఎల్లా వుందో, అక్షరానికీ అక్షరానికీ ఎంత దూరం వుందో అంతా స్పష్టంగా తన కనుపాపల్లో చిత్రించినట్టుగా వుంది.

రోజు గడిచిపోతూంది. ఇంకా రాలేదు మహేశ్వర్. తప్పకుండా ఈవేళ వస్తానని వుంది ఉత్తరంలో. అసలు సాయంత్రం పడకముందే వస్తానని కూడా చెప్పాడు వెళ్ళక ముందు.

గంటలు గడిచిపోతూన్నాయి.

సోఫామీద, విశ్రాంతికి పడుక్కున్న వసుంధర లేచి డ్రెస్సింగు టేబిల్ ముందరికి వెళ్ళింది. అద్దంలో, రేగిన జుట్టు సర్దుకుంది. నలిగిన సన్నని జరీచీర అంచు సర్దుకుంది. ముందర ఒకనాడు ఈ అంచే మెచ్చుకుంటూ, వెనక వేళ్ళాడుతున్న పమిట చెంగు వేళ్ళతో తడిమాడు. ఎవ్వళ్ళో ఎదురుగా వెళుతూంటే, మహేశ్వర్ వెంటనే వెనక చెంగుతీసి వెనకనించీ భుజంమీదికి ముసుగువేసాడు. ''ఏమిటీఈ పూర్వాచారం. ముసుగు ఇప్పుడు ఫేషన్‌కాదే?'' అన్నది వసుంధర, చిరునవ్వుతో. మహేశ్వర్ ముఖం ఎర్రబడ్డది. "అవతల మగవాళ్ళు. కాస్త మర్యాదగా బట్ట వేసుకోడం నేర్చుకో. ఎంత ఫేషన్ అయినా, నా భార్యవయ్యాక ఈ నియమాలు కాస్త పాటించాలి నువ్వు'' అన్నాడు మహేశ్వర్. వసుంధర కళ్ళల్లో చిరు నవ్వు మెరిసింది ఆ జ్ఞాపకంలో.

బంగళా అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దానికి తాళం వేస్తున్నట్టు గోడ గడియారం టిక్ టిక్ మంటోంది. ఆవరణలో లాన్ మీద అశోక వృక్షం నీడ పొడుగవుతోంది. నాన్న తన గదిలోనించి ఇంకా టీకి బయటికి రాలేదు. తల నెప్పి అన్నారు. నిద్రపోతున్నారల్లే ఉంది. ఈవేళ నాన్నగారికి డిస్పెన్సరీ లేదు. వెళ్లనన్నారు.

అందుకనే డ్రైవరూ వెళ్ళిపోయాడు. రామయ్య తప్పగోల గోడకా నించి అవుట్ హౌసు ప్రక్కన నులక మంచంమీద హాయిగా నిద్రపోతున్నాడు. వెంకాయమ్మగారు కూతుర్ని చూడ్డానికి వెళ్లింది. ఫలహారం చేసి టీ ఫ్లాస్కులో పోసి టేబిల్‌మీద పెట్టి మరీ వెళ్లింది. వసుంధర ప్రక్కన ఉన్న కిటికీలోంచి బయటికి చూస్తూ నిలబడి వుంది–చేతుల్తో చువ్వలు పట్టుకుని.

ఎదురుగా ఎండలో, దూరాన, సముద్రం ప్రబంధ విరహిణిలా, నీలి చీర కట్టుకుని ఉంది. వెనకప్రక్కనించీ రైలుకూత వినిపించింది. మహేశ్వర్ వాళ్ళు ఊళ్ళో నించి చాలా రైళ్లు వస్తయి అయినా, తను కారే తెచ్చేస్తున్నారేమో. ఒకసారి మహేశ్వర్‌తో తనూ రైలు ప్రయాణం చేసింది. ఆనాడు నాన్నగారు మెడికల్ కాన్ఫరెన్సుకి వెళుతున్నారు. అమ్మ పోయినప్పటినుండి తను ఊరు విడిచివెళ్ళితే, వసుంధరని కూడా వెంట తీసుకెళ్లడం నాన్నగారికి అలవాటయిపోయింది. అసలు నాన్నగారే అడిగారు మహేశ్వర్‌ని "నువ్వు కూడా వస్తావా? ఏం? రా." అని, నాన్నగారు బ్యాగ్సు సర్దుతున్న వసుంధర ప్రక్కన దిగాలుపడి నుంచునిఉన్న మహేశ్వర్‌ని చూసి–జాలిగా.

రైల్లో చాలా మూక. వసుంధరని పై బెర్తకి ఎక్కపడుక్కోమన్నారు మహేశ్వర్. తన రెండు చేతులూ కలుపుకుని–వేళ్లు బలంగా కరుచుకునేటట్టు – మెట్టుగా చేసి వసుంధరని ఆ చేతులమీద కాళ్లువేసి పైకి ఎక్కమన్నాడు. కాస్త అలసటగా ఉన్న నాన్నగారిని, తన తొడలమీద తలపెట్టి పండుకోపెట్టుకుని తను అల్లాగే కూర్చున్నారు–రాత్రంతా. ఎంత సహనం! ఎంత ప్రేమ మహేశ్వర్‌కి తనవాళ్ళమీదా. తనమీదా అనిపించింది వసుంధరకి. ఎంత సుకుమారంగా కాపాడతాడు, మహేశ్వర్ తనని!

కాని ఒక్కసారిమాత్రం మహా మొరటుగా ప్రవర్తించాడు, మహేశ్వర్. తను ఒకసారి ఆ కాన్ఫరెన్స్ ట్రిప్‌లోనే, ఊరి దేవాలయం చూడ్డానికి వెళ్ళివచ్చేటప్పటికి చీకటి పడుతూంది. తొందరలో అడ్డుదోవని రాబోయి, తెలియక దిగుడు బావిలో వసుంధర కాలు వెయ్య బోయింది. ప్రక్కనేఉన్న మహేశ్వర్, గబుక్కున రెక్క పుచ్చుకుని బలవంతంగా వెనక్కి లాగేశాడు. కాని, వసుంధరకి మైకం వచ్చినంత పని అయింది. పైగా భయపడ్డది కూడాను. సమంగా తిరిగి మనిషి అవడానికి పక్షం రోజులు పట్టింది.

వసుంధరికి జ్ఞాపకాలు తరగడం లేదు. మహేశ్వర్ ఇంకా రాలేదు. ఒకవేళ తనకి ఒళ్ళు ఏమైనా సుస్తీ చేసిందా? ఛ! అపశ్రుతి! ఏం, ఇల్లాంటి పిచ్చిఊహలు వస్తున్నాయి.

వసుంధర గమనించనేలేదు – గదులన్నీ చీకటయిపోతున్నాయి. తలుపు చప్పుడయింది. నాన్న తలుపు తీసుకుని బయట కొచ్చారు. వసుంధర ఉలిక్కిపడి నాన్నకేసి తిరిగింది. అబ్బ! నాన్న ముఖం ఎంత అలసిపోయినట్లుంది. తను ఇన్నాళ్లూ గమనించనేలేదు. ఒక్క అంగలో నాన్నదగ్గరికి దూకి నాన్న చెయ్యిపట్టుకుని ఆత్రంగా, "నాన్నా తలనెప్పి ఎల్లాఉంది''ని అడిగింది.

"అల్లాగే ఉందమ్మా. ఆరు బయట కూచుందాం రా. ఫేన్ వద్దు.' అన్నారు డాక్టర్ ప్రతాప్‌గిరిగారు, గబుక్కున వెళ్లి ఫేన్ స్పీడ్ ఎక్కించబోతున్న, వసుంధరతో.

"సరే మిద్దెమీదనే కూచుందాం నాన్నా. కుర్చీలన్నీ బయటికి ఈడ్చేస్తాను. పోదాం రా," అంది చెయ్యిపట్టుకుని తను ముందడుగు వేస్తూ.

డా॥ ప్రతాప్‌గిరి మిద్దెమీద ఈజీఛెయిర్‌లో కూచుని చెరూట్ పీలుస్తున్నారు. ఆయన కళ్లల్లో ఏదో అవ్యక్త వ్యధ తొణికిసలాడుతూంది. ఎదురుగా కుర్చీలో వసుంధర కూచుని వీధి గేటుకేసి చూస్తోంది. తన మనస్సులో ఆలోచనలు పరిగెడు తున్నాయి–బరువుగా తోటంతా నిశ్శబ్దంగా ఉంది. వసుంధర చటుక్కున లేచి అటూ ఇటూ తిరుగుతూంది. వసుంధరికి తన బాధలతోపాటు తన తండ్రి అనుభవిస్తున్న ఈ మనోవ్యధ లేమిటో తెలియక మరీ బరువయింది మనస్సు. నాన్న కళ్లు మూసుకున్నారు.

ఆకాశంమీద చిలకల గుంపులు తోటల్లోనించీ గూళ్ళకి వెళ్లిపోతున్నయి. దూరాన్న రోడ్డుమీద ఆవులూ, బర్రెలూ వాటి వాటి దూడలతో ఇళ్ళకి పోతూన్నయి. డాబాకి ఎదురుగా ఆవరణలో ఉన్న ప్రొద్దు దిరుగుడు పువ్వులు మరుగై పోయిన సూర్యుణ్నే చూస్తూ పడమటి దిక్కుగా వాలిపోయినయి.

తన ఆలోచనలని అరికట్టాలన్నట్లు, ఉన్నట్టుండి వసుంధర, "నాన్నా, మహేశ్వర్ మీతో మాట్లాడుతాడుట వచ్చిన తరువాత," అంది.

డా॥ ప్రతాప్‌గిరి కళ్లు మూసుకునే, చెరూట్ మరీ గుప్ గుప్‌మని పీలుస్తున్నారు. తాను భయపడిన ఘడియలు వచ్చేసినయి. ఈ గడచిన సంవత్సరం అంతా ఈ

ఘడియలు వస్తాయని తనకి తెలుసు. తెలిసే ఒణికిపోతూండేవారు. వసుంధర తప్ప తనకి జీవితంలో కావలసినది మరి ఏదీ లేదు. తన ఏకైక సంతానం, వసుంధర కోసం తాను చెయ్యలేనిది ఏదీలేదు. ఆ బిడ్డకోసమే తాను అసలు బ్రతికి ఉన్నది. వసుంధర తన జీవితంలో ఏమాత్రము సుఖపడ్డా డాక్టరు ప్రతాప్‌గిరికి దానిని మించిన స్వర్గం వేరే లేదు. కాని, మహేశ్వరుని చూసినప్పుడల్లా గుండెలు జారిపోతూండేవి.

మహేశ్వర్ యోగ్యుడు. బుద్ధిమంతుడు అయితేమాత్రం?

చూరులో గూట్లో ఉన్న పిచ్చికలు కిచ కిచ మన్నవి-ఏదో పక్షి సంభాషణలో. అవే పిచ్చుకలు-ఒక నెల క్రితం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది డాక్టర్ ప్రతాప్ గిరికి-ఈ పిచ్చుకలు రెండూ గూడుకట్టుకుంటుండే రోజులవి. మహేశ్వర్ ముచ్చట పడే వాడు. ఎండిపోయిన గడ్డి పరకలూ అవీ తెచ్చి, వాటిదగ్గరగా పడవేసి ఒక బేసిన్‌లో నీళ్ళు పోసి త్రాగమని దగ్గరగా పెట్టేవాడు. ఒకనాడు ఎక్కడనించో మరో పోతు పిచ్చుక వచ్చింది. ఈ మగది గడ్డి పరకలూ పీచూ అదీ ఏరుకురావడానికి బయటికి వెళ్లినప్పుడు. ఆ క్రొత్తపిచ్చుక ఒంటరిగా ఉన్న ఈ ఆడపిచ్చుక దగ్గరికి వచ్చి దీనితో స్నేహం చెయ్యబోయింది. అసలు పోతుపిచ్చుక ఆ సమయానికే వచ్చి ఈ విషయం చూసి ఆ క్రొత్త పోతుపిచ్చుకని పొడిచి పొడిచి చంపేసింది. డాక్టర్ ప్రతాప్‌గిరిగారు చాలా జాలిపడి "పాపం ఆ పిచ్చుకని ఇది చంపేసిందయ్యా," అన్నారు, అప్పుడే వచ్చి విషయమంతావిన్న మహేశ్వర్‌తో.

"పాపమేముంది? ప్రాణం ఉసూరు మంటుందేకాని మనకి. అసలీ పోతుపిచ్చుక్కి మనస్సిలా ఉండి ఉంటుంది. మనం స్వంతం అనుకున్న ఆడదానిని ఇంకొకడు కన్నెత్తి చూస్తే మనిషే భరించలేడు గదా! అది అంతేలెండి, సృష్టిలో మనిషికీ అంతే. మృగానికీ అంతే. అప్పుడు దయాదాక్షిణ్యా లుండవు,'' అన్నాడు మహేశ్వర్ నిర్లక్ష్యంగా.

డాక్టర్ ప్రతాప్‌గిరి గుండెలు జారిపోయినయ్యి.

ఈ మహేశ్వర్ తన బిడ్డ వసుంధరని తన ఇల్లాలుగా చేసుకోబోతున్నాడు. ఆ విషయం తన కెన్నడో గ్రాహ్యమైంది.

"నాన్నా, ఏం నాన్నా మాట్లాడవు? మహేశ్వర్ ఇంకా రాలేదే! మరేంలేదు, వస్తే, ఈవేళ మంచిరోజుట, మీతో మాట్లాడతాడుట. అందుకని,' అంది, తిరిగి

డాక్టర్ ప్రతాప్‌గిరి, తనలో తానే అనుకుంటున్నట్టు వ్రేళ్ళతో నుదురు తడుము కుంటూ. ఇక కాళ్ళు పట్టివ్వనట్లు కుర్చీలోమళ్ళీ చతికిలబడ్డారు. వసుంధర తండ్రి ముందర మోకరిల్లి కూచుని తండ్రి నడుము, చేతులతో చుట్టేసుకుంది.

"ఏం నాన్న అలా అంటావు? మహేశ్వర్‌కి సంస్కారం ఉంది నాన్నా" అంది ప్రాధేయపడే స్వరంతో. తండ్రికి ఆమాట వినిపించినట్టు లేదు. తన ఆలోచనలలో తానే నిమగ్నులై వున్నారు.

మహేశ్వర్‌కి సంస్కారం వుంది. అవును, తనకి అది నిర్ధారణే. ఎంత సంస్కారం లేకపోతే, ఎన్నడూ, ముందూ వెనకా తెలియని తనకి ఆనాడు చేతు లడ్డుపెట్టి మిగతా గుంపుని దగ్గరికి రానివ్వకుండా చేశారు సినీమా హాల్లో. ఆ మగవాళ్ళ గుంపుకీ, తనకీ మధ్యన నిలబడి వీరుడులా ఆ గుంపు అందరూ వెళ్ళేవరకూ, చాచిన చేతులు మడుచుకోలేదు. ఎన్నడూలేనిది ఆరోజు రిపబ్లిక్ డే అని నాన్న సినిమాకు తీసికెళ్ళారు.

"మగవాళ్ళంటే మీకింత అసహ్యమాండీ, అన్నారు మహేశ్వర్ చిరునవ్వుతో తండ్రిని తనని పరిచయం చేసిన తరువాత.''

"మీలాంటి ఆడపిల్లల్ని చూడడం నా కెంతో సంతోషంగా వుంది. ఈరోజుల్లో ఈమాత్రం నిబ్బరంగా వున్న ఆడపిల్లలు అరుదు. అందుకనే నేను వివాహం మాటే తలపెట్టలేదు ఇన్నాళ్ళూ,'' అన్నారు కాస్త పరిచయ మయ్యాక - ఎంతో తృప్తితో.

మహేశ్వర్ అంటే మట్టుకు ఎందుకో వసుంధరకి కోపమూ రాలేదు. అసహ్యమూ రాలేదు.

"అమ్మా" అన్నారు డాక్టర్ ప్రతాప్‌గిరి. చటుక్కున తల ఎత్తి. ఒక్క క్షణం ఆగి, "మహేశ్వరుతో జరిగిన విషయమంతా చెప్పావా?'' అడిగారు - ఈ సంభాషణ ఇష్టంలేనివాడిలా.

"నాన్నా!" అన్నది వసుంధర గాభరాగా ఒక్క అడుగు దూరంగావేసి నిలబడి.

"నాన్నా, ఇంకేమున్నా వుందా? కొంపలుపోవూ?" అంది వసుంధర.

"ఎప్పుడో పోయే కొంపలు ఇప్పుడే పోతేమాత్రం ఏం అమ్మా?" అంటూ లేచి నిలబడ్డారు.

"నాన్నా, నాన్నా ఈ ఒక్కసారి ఊర్కో నాన్నా'' అంది బ్రతిమాలుతూ.

"ఈ ఒక్కసారేమిటే పిచ్చిదానా, మళ్ళీ ఈ తరుణం వస్తుందా ఏం, జీవితంలో. మతిలేకుండ మాట్లాడుతున్నావు. చెప్పెయ్యడం మంచిదమ్మా," అన్నారు చెట్లకొమ్మల కేసిచూస్తూ. పరధ్యానంగా అంటున్నట్టూ, డాక్టర్ ప్రతాప్‌గిరిగారి ముఖం అంతా కటువుతేరింది.

వసుంధర తన ఆశలన్నీ ఒక్కసారి మటుమాయమైపోయినట్టు ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి, తలయెత్తి చూసింది. నాన్న ముఖం ఇంకా అలాగే వుంది - ఎక్కడా సౌమ్యత లేదు కళ్ళల్లో. వసుంధర లేచి వెళ్ళి నాన్నకి ఎదురుగా వున్న కుర్చీలో కూచోబడి పోయింది. "నాన్నా నీవన్నదీ నిజమే. చెప్పడం మంచిదే నాన్నా!" అంది. ఏడుపు గొంతుకతో ముఖం చేతులతో కప్పుకుని.

డాక్టర్ ప్రతాప్‌గిరికి ఈ మాటలు వినబడినట్టు లేదు. గుప్ గుప్ మంటూ చుట్ట పీలుస్తూ తోటకేసి చూస్తూ నిలబడ్డారు. ఆవరణంతా నిశ్శబ్దంగానే వుంది. ఏ అలికిడీ లేదు - డాబామీద, తన వెనుక నించి వచ్చే వసుంధర వెక్కివెక్కి ఏడ్చే శబ్దంతప్ప. చుట్టూ సముద్రప్రాంతపు మసకబారిన వెన్నెల-వాడినపువ్వుల వాసనలా.

కాస్సేపటికి దూరాన కారు శబ్దం అయింది. కుర్చీలో వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం ఆగింది. వసుంధర తల పైకెత్తి దీనంగా తండ్రి ముఖంకేసి చూసింది. పచార్లు చేస్తున్న తండ్రి ఛటుక్కున ఆగి "అమ్మా నువ్వు లోపలికి వెళ్ళు ఒక్క పదినిమిషాలు," అని ఆజ్ఞచేశారు.

ఇన్ని సంవత్సరాలూ అణుకువతోనూ క్రమశిక్షణతోనూ పెరిగిన పెంపకం, వసుంధర నోరు కట్టేసింది. కటికవాడు లాక్కెళ్తాంటే లేగదూడ గోమాతకేసి చూసినట్టు, వసుంధర తండ్రికేసి చూస్తూ లోపలి గదుల్లోకి వెళ్ళిపోయింది.

కారు తన కాంపౌండు గేటు లోపల ఆగింది. డాక్టర్ ప్రతాప్ గిరి క్రిందికి చూశాడు. కారు ఆగుతూనే చటుక్కున బయటికి దూకారు మహేశ్వర్."Hello Doctor Good morning. Sorry I am late my car gave trouble. ఊళ్ళోకి వచ్చిన తరువాతనే ట్రబుల్ ఇచ్చింది. ఇదిగో వచ్చేస్తున్నాను," అని ఒక్క సేల్యూట్ చేశాడు.

మహేశ్వర్ యవ్వనమూ, దారుఢ్యమూ కళ్లు జిగేలుమన్నాయి డాక్టరుకి. ఎంత తరుణ శోభ! సృష్టి విచిత్రం! ఇంత మిడి మిడి మిసిమిలో ఒక్కొక్కప్పుడు, ఎంత చీకటి జ్వాలలు మండుతూంటాయో! ఆరు సంవత్సరాలనాటి పచ్చి నెత్తురు వాసన ముక్కులో కొట్టింది, డాక్టరుకి. సుకుమారంగా పెరిగిన పసిడి పాదాలు, నెత్తురు చారికలతో ఉన్న కాళ్లు తన చేతులమీదనించి క్రిందికి వ్రేళ్ళాడుతూ, కళ్ళల్లో తిరిగినయి. తన అన్ని సంవత్సరాల శస్త్రానుభవమూ ఆలేత శరీరంమీద ప్రయోగించారు డాక్టర్ ప్రతాప్‌గిరి. ఏమూలనో దాగి ఉన్న నాడి తిరిగి కొట్టుకోటం ఆరంభించింది. ప్రాణం దక్కింది. అంతే!

ఎదురుగా రెండు మెట్లు ఒక్కసారి దూకి అంగవేసుకుంటూ, ముఖమంతా నవ్వుతో ఎగిరివచ్చాడు మహేశ్వర్. "where is Devi? ఏది ఎక్కడి కెళ్లింది?" అని కళ్లు చిట్లించి అడిగాడు ఆశ్చర్యంతో.

"ఉంది. వచ్చేస్తుంది. కూచో!" అన్నారు డాక్టర్ ప్రతాప్‌గిరి. మహేశ్వర్ వెంటనే "థేంక్యూ డాక్టర్!" అంటూ, వసుంధర ఖాళీ చేసిన కుర్చీలో కూచుంటూనే ఇంటి లోపలికి తొంగి చూశారు. డాక్టరుకి తెలియకుండానే.

"ఇవ్వాళ మీతో ఒక విషయం ప్రస్తావిద్దామని అనుకున్నాను. చెప్పిందా దేవి? అంటే... .... మీరు క్షమించాలి నా చొరవకి....'' అన్నాడు ముఖం చేటంత చేసుకుని-అమిత ఆనందంగా.

"మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి మహేశ్వర్'' అన్నారు డా॥ ప్రతాప్‌గిరి, ముఖం చిట్లించి-మహేశ్వర్ మాట పట్టించుకోకుండానే. ఆయన ముఖం అంతా మాడ్చుకోవడం మహేశ్వర్ ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. కాస్త ఆశ్చర్యపడ్డాడు. ఈవేళ డాక్టరుగారి ధోరణే వేరే విధంగా ఉంది.

"Come on Doctor Go ahead. I am all attention. చెప్పండి. ఇక చెప్పండి బాబూ! ఆ ముఖ్యవిషయం ఏమిటో,'' అన్నాడు మహేశ్వర్ చిరునవ్వుతో, సిగరెట్టు కేసు బయటికి వేస్తూ, కుర్చీలో ముందరికి వంగి.

''మన పొలిమేరలో యుద్ధం ఘోరంగా జరిగే రోజులవి. నేను ప్రాక్టీస్ పెట్టిన ఊరు ఆ పొలిమేరకి చాలా దగ్గర," మొదలుపెట్టారు డాక్టరు.

"అలాగా?" అన్నాడు మహేశ్వర్.

"నా కుటుంబం నాతోనే ఉంది ఆరోజున. కాని, అలా జరుగుతుందని ఎవ్వరూ అనుకోలేదు," అన్నారు డాక్టర్ ప్రతాప్‌గిరి మహేశ్వర్ మాట విననట్టుగానే.

డాక్టరుగారికి నోరు పిడారినట్టుగా అయింది. ప్రక్కన టేబిల్ మీద ఉన్న టంబ్లరులో నీళ్లు గట గట త్రాగేశారు. ఖాళీ టంబ్లరు తిరిగి టేబిల్‌మీద పెడుతూ, "వసుంధర కన్నెపిల్లకాదు. రహస్య దాడీలో శత్రువులు దానిని చెరిచేశారు," అన్నారు, ఏదో పాఠం ఒప్పచెబుతున్నట్టు-గబ గబ.

గ్లాసు టంబ్లరు క్రింద పడి టపాలున ముక్కలయింది-టేబిల్‌మీద పెట్టాననుకుని ఓరనే పెట్టేసారు డాక్టరు, టంబ్లరుని.

"ఆఁ!" అన్నాడు మహేశ్వర్, కళ్లెర్రచేసి, గబుక్కున కుర్చీలోనించీ లేచి నిలబడి.

"మరి నాతో ముందరే ఎందుకు చెప్పలేదు? మోసం! ఇది మోసం!" అంటూ కుర్చీలో మళ్లీ కూలబడ్డాడు మహేశ్వర్.

డాక్టర్ ప్రతాప్‌గిరి నుదుట చెమట కర్చీఫ్‌తో తుడుచుకుంటూ మహేశ్వర్‌కి ఎదురుగా నిలబడ్డారు, గంభీరంగా.

"చెప్పడానికి సాహసం లేకపోయింది ఇన్నాళ్ళూ. కాని ఆఖరుకి చెప్పకుండా ఉండడానికి నా సంస్కారం ఒప్పలేదు," అన్నారు డాక్టరు, చాలా ఖచ్చితమైన స్వరంతో.

మహేశ్వర్ తల క్రిందికి వంచుకుని ముఖం రెండు చేతులతో కప్పుకున్నాడు. అతని గొంతులోనించి ఒక మూలుగు వినిపించింది. అనుకోకుండా మృత్యువు ఎదురైన జీవుల ఆర్తనాదం లాగుంది అతని ఆ అవ్యక్త కంఠం.

ఒక్క పదిక్షణాలు అంతా నిశ్శబ్దం. ఎవ్వరూ కదలలేదు. పాతాళ వహ్నిని కడుపులో ఇముడ్చుకుని సముద్రం చల్లని చంద్రకిరణాలతో చెలగాటలాడుతూంది.

"మెల్లగా మహేశ్వర్ తల ఎత్తాడు. కళ్ళల్లో నీళ్ళు నిండి ఉన్నాయి. లేచి నించున్నాడు."

"మీకింత సంస్కారం స్వతహాగా వచ్చిందో, జీవితమే నేర్పిందో నాకు తెలియడంలేదు, నాకు నేర్పింది మాత్రం అవ్యాజ ప్రేమ. మీకు సమ్మతమైతే, వసుంధరకీ నాకూ వివాహానికి ముహూర్తం పెట్టించండి. నాకు మీరు తప్ప పెద్దవాళ్లు లేరు," అన్నాడు, చేతులుజోడించి మహేశ్వర్-డాక్టరుకేసి చూస్తూ.

రెండు చేతులూ చాచి ఒక్క అంగలోవచ్చి కౌగిలించుకున్నారు డాక్టరు ప్రతాప్ గిరి, మహేశ్వరుని. మహేశ్వర్ బలీయమైన మెడమీద, వెచ్చటి కన్నీళ్ళతో తడిసిన డాక్టరు వయస్సు మళ్ళిన చెక్కిలి చటుక్కున వచ్చి తగిలింది.

❖ ❖ ❖